
# ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 39.5
కనిష్ఠం 24.6

ANDHRAJYOTHY



# యాదాద్రి భువనగిరి

5

ఆదివారం 16 జూన్ 2024


**ప్రాజెక్టుల నీటిమట్టం**

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుత | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.5050) | 504.60 (122.6854) | నిల్ | 800 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 637.60 (2.60) | 203 | 84.39 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 99.08 (0.69) | నిల్ | 1,943 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.168 | డ్రెస్ : రూ.260 | స్కిన్‌లెస్ : రూ.290

గత ప్రభుత్వం 2017 నుంచి అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం అవకతవకలపై మనిలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద విచారణ చేపట్టిన కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమాచారం అడగటంతో రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఈ నెల 14న ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈడీ కోరిన సమాచారాన్ని ఇవ్వాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ నిర్ణయించడంతో పాటు జిల్లాల నుంచి పూర్తి సమాచారం పంపాలని ఆదేశించింది. దీంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు పూర్తి వివరాలతో కూడిన ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపించినట్లు తెలిసింది.

\- నల్లగొండ



## గొర్రెల పంపిణీ
# లెక్కలు ఈడీకి?

- రాష్ట్ర అధికారుల ఆదేశాలతో ఫైల్ సిద్ధం
- కలెక్టరేట్‌కు పంపించిన పశుసంవర్ధకశాఖ
- పథకం అమలు తీరుపై పూర్తి వివరాలతో నివేదిక
- త్వరలో బయటపడనున్న లోగుట్టు

గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి ఎన్ని యూనిట్లను కొనుగోలు చేశారు? ఎన్ని యూనిట్లు పంపిణీ చేశారు? లబ్ధిదారులు ఎవరెవరూ? ఎన్ని కోట్ల బిల్లులు చెల్లించారు? అనే సమాచారాన్ని నల్లగొండ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు కలెక్టరేట్‌కు పంపించినట్లు తెలిసింది. కలెక్టరేట్‌లో ఉన్న ఫైల్‌పై కలెక్టర్ సంతకం చేసిన వెనువెంటనే దాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపించనున్నారు.అయితే ఇంతలో ప్రభుత్వం కలెక్టర్‌ను బదిలీ చేయడంతో ఆ ఫైల్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. నూతన కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సంబంధిత ఫైల్ వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి, అటునుంచి ఈడీకి చేరనుందని తెలిసింది.

**20మంది దళారులు, 23,730గొర్రెలు**

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కొకరి నుంచి కేవలం 10నుంచి 12యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ పశుసంవర్ధక శాఖతో పాటు డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు ఏపీ రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం జిల్లాలు, కర్నాటక రాష్ట్రంలో బీదర్‌లో ఒక్కో దళారీ నుంచి 150 నుంచి 200 యూనిట్ల గొర్రెలను కొనుగోలు చేశారు. కేవలం 20 మంది దళారుల నుంచి 1,130యూనిట్ల గొర్రెలు అంటే 23,730గొర్రెలు కొనుగోలు చేయడంతో అడ్డంగా దొరికిపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రాష్ట్ర స్థాయి నుంచి ఓ అధికారి జిల్లా అధికారులకు ఫోన్ చేసి ఫలానా సంస్థల నుంచి గొర్రెలను కొనుగోలు చేయాలని, అధికారికంగా కాకుండా అనధికారికంగా జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకరావడంతో ఈ కొనుగోళ్లు జరిగినట్టు చర్చ సాగుతోంది. అందుకు సంబంధించిన గొర్రెల కొనుగోళ్ల ప్రక్రియలో భాగంగా రూ.18కోట్లు బిల్లులు చేయాలని సూచనలు వచ్చినా జిల్లా స్థాయిలో ఓ అధికారి ఒప్పుకోకపోవడంతోనే ఆ ఫైల్ పెండింగ్‌లో పడినట్టు పశుసంవర్ధక శాఖలో చర్చ నడుస్తోంది. ఇద్దరు అధికారులకు ప్రత్యేకంగా గత ప్రభుత్వం ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించినా, రూ.18కోట్ల బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి.

ఆ అధికారులు ఫైల్‌ను కదిలించాలని చూసినా, కలెక్టరేట్‌లో సదరు అధికార యంత్రాంగానికి చుక్కెదురైంది. ఇద్దరు కలెక్టర్లు సైతం ఆ ఫైల్‌కు మోక్షం కల్పించకుండా దాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉందని తిప్పి పంపినట్టు సమాచారం. దీంతో చాలా రోజులుగా ఆ ఫైల్ జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే మూలుగుతోంది.

దీనిపై ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి' కూడా కథనం ప్రచురించింది. చివరికి విచారణ నిమిత్తం ఈడీ సమాచారం కోరడం, అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని ప్రభుత్వం సదరు శాఖను ఆదేశించడంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు వివరాలను కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ నుంచి ఈ ఫైల్ ప్రభుత్వానికి అక్కడి నుంచి ఈడీకి చేరాల్సి ఉంది. ఆ తరువాత ఈడీ విచారణ అనంతరం గొర్రెల పంపిణీలో అక్రమాలు పూర్తిస్థాయిలో బయటపడనున్నాయి.

**గొర్రెల పథకం ఫైల్ పంపాం**

రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశించిన మేరకు జిల్లాలో మొదటి నుంచి అమలు అవుతున్న గొర్రెల యూనిట్ల పథకం వివరాల ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపించాం. మేం అందించిన నివేదికను కలెక్టర్ రాష్ట్ర స్థాయి అధికారులకు పంపిస్తారు. పథంక అమలుకు సంబంధించిన వివరాలు ఆఫైల్‌లో పొందుపర్చాం.

\- శ్రీనివాసరావు, నల్లగొండ జేడీ

**సమగ్ర సమాచారంతో వివరాలు..**

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు 2017 నుంచి గొర్రెల పంపిణీ పథకం అమలు తీరుతో పాటు మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా జరిగిన గొర్రెల పంపిణీ, ఆ తరువాత పథకం నిలిచిపోయిన వివరాలు కూడా నివేదికలో పొందుపరిచినట్టు తెలిసింది. మొదటి దశలో ఎన్ని యూనిట్లు పంపిణీ చేశారన్నా వివరాలతో పాటు రీసైక్లింగ్ వివరాలు కూడా అందులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గొర్రెలు కొనుగోలు చేసి జిల్లాకు వచ్చిన మరుక్షణమే తిరిగి రీసైక్లింగ్ ద్వారా విక్రయించిన విషయం గతంలోనే బయటపడింది. రీసైక్లింగ్‌కు సంబంధించి నల్లగొండ జిల్లాలో సుమారు 90కేసులకు పైగా నమోదయ్యాయి.

అప్పట్లో పలువురు దళారులతో పాటు కొంతమంది పశుసంవర్ధకశాఖ ఉద్యోగులపై కూడా ఆరోపణలు వచ్చాయి. మొదటి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65వేల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, ఈ గొర్రెలన్నింటినీ స్థానికంగా కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సేకరించారు. వీటి సేకరణ, ఆ తరువాత రీసైక్లింగ్ వంటి అక్రమాలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. కాగితాలపై గొర్రెల లెక్కలు చూపి క్షేత్రస్థాయిలో మాత్రం లక్ష రూపాయలు చేతులు మారినట్టు నాడు ఆరోపణలు వచ్చాయి. కొంతమంది ఇతర శాఖలకు చెందిన అధికారులు డిప్యుటేషన్ వేయించుకుని మరి గొర్రెల కొనుగోలుకు ఆసక్తి కనబర్చడం కూడా వెలుగుచూసింది.

## ఉమ్మడి జిల్లాలో
# ఇద్దరు కలెక్టర్లు బదిలీ

- నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా నారాయణరెడ్డి
- జాయింట్ కలెక్టర్‌గా ఇక్కడ పనిచేసిన అనుభవం
- సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా నందలాల్ పవార్

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కలెక్టర్లను బదిలీ చేస్తూ, కొత్తగా ఇద్దరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం జీవో 840ను విడుదల చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన స్థానంలో సీ.నారాయణరెడ్డిని నియమించారు. అదే విధంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ స్థానంలో తేజస్ నంద లాల్ పవార్ నియమితులయ్యారు. అయితే దాసరి హరిచందనకు, ఎస్.వెంకట్రావ్‌కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

\- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)





నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నారాయణరెడ్డి ప్రస్తుతం వికారాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు నిజామాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్‌గా ఆయన పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా కూడా పనిచేశారు. 2009లో గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి ఆర్డీవోగా ఎంపికయ్యాకైన ఆయన పెద్దపల్లి, సూర్యాపేట, గద్వాలలో ఆర్డీవోగా పనిచేశారు. 2015లో కన్ఫర్డ్ ఐఏఎస్ కావడంతో తదుపరి పదోన్నతిపై జాయింట్ కలెక్టర్‌గా నల్లగొండలో పనిచేశారు. నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో సమర్థంగా పనిచేసిన అధికారిగా పేరుపొందారు. 2019లో ములుగు జిల్లా ఏర్పాటైనప్పుడు తొలి కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆతర్వాత నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేశారు. కోవిడ్ సమయంలో నిజామాబాద్‌లో ఆయన చేసిన సేవలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఆ తరువాత 2023, ఫిబ్రవరి 2 నుంచి వికారాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తూ తాజాగా నల్లగొండకు బదిలీ అయ్యారు. నారాయణరెడ్డి స్వగ్రామం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నర్వ మండలం శ్రీపురం. ఆ గ్రామానికి పక్కన ఉన్న కల్వాల ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్న ఆయన మక్తల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతివరకు చదివారు. అనంతరం ఇంటర్ కూడా అక్కడే చేశారు. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బీఎడ్ చదివిన ఆయన, 2006 డీఎస్సీలో మహబూబ్‌నగర్ జిల్లా టాపర్‌గా నిలిచారు. స్వగ్రామంలోనే ఆరునెలల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2009 గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్రంలో నాలుగో ర్యాంకు సాధించి ఆర్డీవోగా నియమితులయ్యారు. అంచలంచెలుగా కలెక్టర్ దాకా ఎదిగిన ఆయన, పనిచేసిన అన్ని ప్రాంతాల్లో సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకోవడంతో, తాజాగా ప్రభుత్వం రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా ఉన్న నల్లగొండకు నారాయణరెడ్డిని కలెక్టర్‌గా నియమించిందని అధికారవర్గాల్లో చర్చసాగుతోంది.

**పేట కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్**

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్ నియమితులయ్యారు. ఆయన గతంలో కామారెడ్డి, మహబూబ్‌నగర్‌లో అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత వనపర్తి కలెక్టర్‌గా పనిచేస్తూ తాజాగా సూర్యాపేటకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.వెంకట్రావ్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.



ఎస్.వెంకట్రావ్

**స్వల్పకాలమే పనిచేసిన హరిచందన**

చురుకైన ఐఏఎస్ అధికారిగా పేరున్న దాసరి హరిచందన నల్లగొండ కలెక్టర్‌గా నియమితులైన కొద్దికాలానికే బదిలీ అయ్యారు. ఈ ఏడాది జనవరి 3న ఆమె నల్లగొండ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఐదు నెలల పైచిలుకు కొద్దికాలమే కలెక్టర్‌గా పనిచేసినప్పటికీ తనదైన ముద్రవేశారు. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికలు, శాసన మండలి ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా సమర్థంగా బాధ్యతలను నిర్వహించారు. సమాంతరంగా రెండు ఎన్నికలు రావడంతో, అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో రెండింటినీ విజయవంతంగా పూర్తిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా, ఆమెకు తదుపరి పోస్టింగు ఇవ్వకపోవడంతో ప్రాధాన్యమున్న పోస్టుకు నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## నేడు శాలిగౌరారం ప్రాజెక్టు నీటి విడుదల




శాలిగౌరారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఐబీ డీఈ సత్యనారాయణ

**శాలిగౌరారం, జూన్ 15:** జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని ఖరీఫ్ సీజన్‌కుగాను ఆదివారం ఉదయం 11గంటలకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల డీఈ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఐబీ డీఈ సత్యనారాయణ ప్రాజెక్టు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 17అడుగులుగా ఉందని, ఖరీఫ్ సీజన్‌కు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆదివారం నీటిని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ విడుదల చేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు సకాలంలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఐబీ ఏఈ రాములు, నాయకులు చామల వెంటకరమణారెడ్డి పాల్గొన్నారు.

## సజావుగా పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

**334 మంది హాజరు**

**నల్లగొండ టౌన్, జూన్ 15:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం మొట్టమొదటిసారి నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష సజావుగా కొనసాగింది. వివిధ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ చేరేందుకు 399 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 334మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్ట్స్ కళాశాల కేంద్రంగా జరిగిన పరీక్షను రెండు విడతలుగా నిర్వహించారు. బిజినెస్ మేనేజ్మెంట్‌లో 149, బయోటెక్నాలజీ 19, కామర్స్ 81, కెమిస్ట్రీ 37, బయోకెమిస్ట్రీ 7, సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ 43, మ్యాథమెటిక్స్‌లో 29 మంది హాజరయ్యారు. ప్రవేశ పరీక్ష ప్రాథమిక కీని జూన్ 21న విడుదల చేయనున్నట్లు, తుది కీని జూలై 2న విడుదల చేయనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆకుల రవి తెలిపారు. పరీక్ష నిర్వహణపై అభ్యంతరాలు ఉంటే జూన్ 26వ తేదీలోపు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో తెలియజేయాలన్నారు. పరీక్ష నిర్వహణను రిజిస్ట్రార్ అల్వాల అల్వాల రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ డైరెక్టర్ ఆకుల రవి, అరుణప్రియ పర్యవేక్షించారు.

## రాజాపేట పాఠశాలలో డీఈవో తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో నారాయణరెడ్డి

**రాజాపేట, జూన్ 15:** రాజాపేట మండల కేంద్రంలో ని ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో కే.నారాయణరెడ్డి పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. బడిబాటలో భాగంగా మంత్రి వెంకట్‌రెడ్డి పర్యటన ఉండడడంతో సభావేదిక, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాల పురోగతి, మధ్యాహ్న భోజనంపై ఉ పాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికా రి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు మహేందర్, సీఎంవో లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి వేడుకల్లో ఎంపీ ఈటల



పెద్దమ్మ తల్లి ఉత్సవాలకు హాజరైన ఎంపీ ఈటల

**బీబీనగర్, జూన్15:** మండలంలోని కొండమడుగు గ్రామంలో జరుగుతున్న పెదమ్మ తల్లి వార్షిక ఉత్సవాలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఎంపీకి ఆశీర్వచనాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు వెలసిన చోట ఆధ్యాత్మికత ఉట్టిపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అరిగె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కనకబోయిన నాగరాజు, రాము, గోపాల్, జహంగీర్, బాలరాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయం

- త్వరలో 13వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రంలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీచేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

**శాలిగౌరారం, జూన్ 15:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుల కోసం ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో 6వేల పాఠశాలలు మూసివేసిందన్నారు. దశల వారీగా రూ.600 కోట్లతో అన్ని పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో 13వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలో అభయ హస్తంలో ఉన్న అన్ని పథకాలు అర్హులందరికీ అందిస్తామని, అలాగే రూ.2లక్షల రైతు రుణమాఫీ ఆగస్టు 15నాటికి చేస్తామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించి పిల్లలకు బంగారు భవిష్యత్ కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గాలవారీగా పేదలైన అర్హులకు నిర్మించి ఇస్తామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.2లక్షల10వేలు అందజేశారు. ఆసిఫ్‌నెహర్ కాల్వను తర్వలో పూర్తిచేస్తానని తెలిపారు. మండలంలోని రోడ్లన్నీ పక్కారోడ్లుగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఈ సందర్భంగా అందజేశారు. ఎస్ఎస్‌సీలో ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.10వేల చొప్పున నగదు పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రణీల, వల్లాల ఎంపీటీసీ మాదగోని కవిత, మాజీ సర్పంచ్ ఇంతియాజ్, తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపీడీవో రేకల లక్ష్మయ్య, మండల విద్యాధికారి ఎం.నాగయ్య, వల్లాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి, ఏపీఎం జానకి, వైస్ ప్రిన్సిపాల్ పులి చిరంజీవి, శీలం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ శివారులో ఉన్న తాళ్లకుంట మైసమ్మ ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు శానాల యుగేందర్‌రెడ్డి, గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, నూకభద్రయ్య, కొల్లు రవీందర్‌రెడ్డి, పెరుమాళ్ల హుస్సేన్,లు మంత్రికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

**విద్యకు రూ.22వేల కోట్లు**

**నూతన్‌కల్:** రాష్ట్రంలో ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.22 వేల కోట్లు మంజూరు చేశారన్నారు. నూతన్‌కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 10 కంప్యూటర్లు, బాలికలకు మూత్ర శాలలు తన సొంత ఖర్చులతో వెంటనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే తన కుమారుని పేరు పేరిట గ్రామపంచాయతీ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అదే సమయంలో ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ ప్రియాంక, సీఈవో అప్పారావు, డీఆర్‌డీవో మదుసూదన్‌రాజు, డీఈవో అశోక్, తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాళ దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుదా సుదాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమా మల్లారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, ఎంఈవో రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి వ్యతిరేక తీర్పునిచ్చిన ప్రజలు

- హామీల అమలులో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య

**భువనగిరి టౌన్, జూన్ 15:** పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చాలనుకున్న బీజేపీకి ప్రజలు వ్యతిరేక తీర్పునిచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సీపీఎం రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను శనివారం భువనగిరిలో ఆయన ప్రారంభించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. పలు ప్రజా వ్యతిరేక విధానాలతో బీజేపీకి సొంతంగా 240సీట్లు, ఎన్డీఏ కూటమికి 292 సీట్లు మాత్రమే ఇవ్వడం ద్వారా పదేళ్ల మోదీ పాలనపై ప్రజలకున్న ఆగ్రహానికి నిదర్శనమన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదన్నారు. నీట్ ర్యాంకులు, నిర్వహించిన తీరుపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన ఎన్నికల హామీలేవి అమలు చేయలేదన్నారు. నాట్ల సీజన్ ప్రారంభమైనందున వెంటనే రైతు రుణమాఫీని చేయాలని, ఆగస్టు పేరుతో రుణమాఫీని వాయిదా వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం శ్రేణులు ఉద్యమాలకు సిద్ధంకావాలన్నారు. గెలుపోటములు సీపీఎం ప్రజాపోరాటాలపై ప్రభావం చూపవన్నారు. పలు అంశాలపై పలువురు అవగహన కల్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, నాయకులు బట్టుపల్లి అనురాధ, కొండమడుగు నర్సింహ, శిక్షణా తరగతుల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు గడ్డె నర్సింహ పాల్గొన్నారు.

## అక్రమ కేసులను ఎత్తివేయాలి

**మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీపీలకు వినతి**

**సంస్థాన్ నారాయణపురం జూన్ 15:** తెలంగాణలో ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లపై పోలీసులు అక్రమంగా పెడుతున్న కేసులను వెంటనే ఎత్తివేయాలని రాష్ట్ర ఇసుక లారీవెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు శనివారం రాష్ట్ర మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్, డీజీపీ కార్యాలయ అధికారులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు, పేరూరు, ఏటూరు నాగారం మండల పరిధిలో ఇసుక రీచ్‌లోకి వెళ్లిన లారీలను ఇసుక నింపిన తర్వాత డ్రైవర్లు వే బ్రిడ్జి దగ్గర బిల్లులు తీసుకోకముందే వివిధ కారణా లతో పోలీసులు లారీలను అకారణంగా తీసుకెళ్లి డ్రైవర్లపైన, లారీ యజమానులపైన అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుర్వియాదయ్య గౌడ్, కొత్తపేట అసోసియేషన్ అధ్యక్షుడు నర్రి వెంకన్న, జగదీశ్ యాదవ్, గుండు లింగన్నగౌడ్, పట్నం వెంకటేష్, సుర్వి లింగస్వామి, చంద్రం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న లారీ యజమానులు, డ్రైవర్లు

## చింతలపాలెం మండలంలో తెల్లగుడ్లగూబ

**మేళ్లచెర్వు, జూన్ 15 :** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామశివారులో శనివారం తెల్లగుడ్లగూబ లభ్యమైంది. గ్రామస్థులు తెల్లగుడ్లగూబను చూసి ఫారెస్టు బీట్ ఆఫీసర్ అనిల్‌కుమార్ సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని స్వాధీనం చేసుకున్నాడు. కాగా ఒక రెక్క, కాలికి గాయమైనట్లు గుర్తించి, వెటర్నరీ డాక్టర్ మధు వద్ద చికిత్స అందించారు. అనంతరం ఫారెస్టు అధికారి పర్యవేక్షణలో ఉంచారు. సాధారణంగా గుడ్లగూబలు నలుపురంగులో ఉంటాయి. కాని తెలుపు వర్ణంలో గుడ్లగూబ అరుదుగా కనిపిస్తాయని ఫారెస్టు అధికారులు తెలిపారు.



## విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి

**అనంతగిరి, జూన్ 15 :** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతిచెందాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వానకొప్పుల పూర్ణయ్యకు చెందిన రెండు గేదెలు, వానకొప్పుల రోషయ్యకు చెందిన ఒక గేదె, మట్ట బాబురావు, వంకా నర్సింహారావు, వంకా ముత్తయ్యలకు చెందిన ఒక్కో గేదె శుక్రవారం ఉదయం మేత కోసం అడవికి వెళ్లాయి. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో యజమానులు చుట్టుపక్కల గ్రామాల్లో విచారించారు. శనివారం ఉదయం పోలంపల్లి రమేష్ పొలంలో మృతి చెంది ఉండగా స్థానికులు బాధితులకు సమాచారం అందించారు. గేదెలపై విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయని, శుక్రవారం రాత్రి వీచిని ఈదురుగాలులు, భారీవర్షం వల్ల విద్యుత్ తీగలు తెగిపడి ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. విద్యుదాఘాతంతో ఆరు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. ఒక్కో గేదె విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని, తమకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని విద్యుత్ అధికారులు, ప్రభుత్వానికి బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

## ఆరు నెలలైనా డబ్బులు ఇప్పించడంలో నిర్లక్ష్యం



సాగర్ పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

**నాగార్జునసాగర్, జూన్ 15 :** తమ డబ్బులు ఇప్పించడంలో పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ పోస్టాఫీసు వద్ద శనివారం ఆందోళన చేశారు. సబ్‌పోస్టుమాస్టర్ రామకృష్ణ తమ డబ్బులు రూ.కోటిన్నర కాజేసి ఆరు నెలలు గడిచినా తిరిగి ఇప్పించడం లేదన్నారు. ఆరు నెలల్లో డబ్బులు ఇప్పిస్తామని గత ఏడాది డిసెంబరులో పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ నేటివరకు ఎటువంటి స్పందన లేదన్నారు. విచారణ చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఖాతాదారులు వాపోయారు. తాము కష్టపడి దాచుకున్న సొత్తు సబ్‌పోస్ట్‌మాస్టర్ రామకృష్ణ కాజేయడంతో ఈ ఏడాది జనవరిలో మల్లికార్జున్ అనే ఖాతాదారుడు గుండెపోటుతో మృతి చెందాడని అయినప్పటికీ పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులల్లో చలనం లేదన్నారు. తమ సొత్తును త్వరగా తమకు అప్పగించకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

## పీఏబీ ఎన్నికల బరిలో 27 మంది

**భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 :** యాదాద్రిభువనగిరి జిల్లాలోని ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ శనివారంతో ముగియడంతో మొత్తం 9 మంది డైరెక్టర్ పోస్టులకు 27మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల నిర్వహణాధికారి జీ శ్రీనివాస్ తెలిపారు. ఒక ఎస్సీ/ఎస్టీ కేటగిరి డైరెక్టర్ స్థానానికి ఇద్దరు, మహిళా కేటగిరిలో ఇద్దరు డైరెక్టర్లపోస్టులకు ముగ్గురు, ఆరు జనరల్ కేటగిరి స్థానాలకు 22 మంది బరిలో ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించి జాబితా విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్సీ/ఎస్టీ కేటగిరి డైరెక్టర్ స్థానానికి కొండమడుగు ఎల్లస్వామి, పోవానం శ్రీనివాస్‌లు బరిలో ఉన్నారు. రెండు మహిళా కేటగిరి డైరెక్టర్ల స్థానాలకుగాను కడవేరు కవిత, కర్నాటి భార్గవి, గుండు కావ్య బరిలో ఉన్నారు. కాగా, ఆరు జనరల్ కేటగిరి స్థానాలకుగాను ఏలె సుధాకర్, ఏలె హరిశంకర్, కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం, కుడికాల బలరాం, కొంగరి వెంకటేష్, గోలి యాదగిరి, చిక్క కృష్ణ, తడక రమేష్, దోర్నాల వెంకటేష్, నామని శివరాం, నోముల రఘు, పిల్లలమర్రి నరేందర్, భారత రాజేంద్రప్రసాద్, బోడ దయానంద్, మాటూరి రామకృష్ణ, రాగుల పాండు, రాపోలు జ్ఞానేశ్వర్, రాపోలు వేణు, రావుల యాదగిరి, విడెం జయప్రకాష్, సీత దామోదర్, సూరపల్లి రమేష్‌లు బరిలో ఉన్నారని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు.

## దారి మూసివేత పనులను అడ్డుకున్న భూనిర్వాసితులు



నర్సిరెడ్డిగూడెం దారి పనులను అడ్డుకుంటున్న నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులు

**మర్రిగూడ, జూన్ 15:** చర్లగూడ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనుల్లో భాగంగా దారి మూసివేత పనులను భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెంలో శనివారం ముంపు గ్రామం నుంచి శివన్నగూడెం వెళ్లే దారిని, రిజర్వాయర్ పనులను కట్ట నిర్మాణం కోసం మూసివేస్తున్నారు. ఈ నేపథ్యంలో నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు దారిని మూసి వేయవద్దని యంత్రాలను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే కట్ట పనులు చేపట్టాలని వారు పేర్కొన్నారు. సమాచారం ఇవ్వకుండా, తమ గ్రామం నుంచి శివన్నగూడకు వెళ్లే దారిని యంత్రాలు పెట్టి ఎలా మూసి వేస్తారని గ్రామస్థులు ప్రశ్నించారు. అక్కడే ఉన్న కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారులు భూ నిర్వాసితుల దగ్గరకు వెళ్లి కట్ట నిర్మాణ పనులకు సహకరించాలని, అడ్డు పడవద్దని కోరారు. కట్ట నిర్మాణ పనులు నిర్వహించాలిగానీ, దారిని మూసివేత చేపట్టవద్దని పనులు నిర్వహించేందుకు వచ్చిన యంత్రాలను వెనుక్కు పంపించారు. అనంతరం భూనిర్వాసితులు తిరిగి వెళ్లారు.


## సేవా కార్యక్రమాల్లో వాసవీక్లబ్ ముందంజ



ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ట్యాంకులు అందజేస్తున్న వాసవీక్లబ్ గవర్నర్ కమలాకర్

**నేరేడుచర్ల, జూన్ 15:** వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాచర్ల కమలాకర్ తెలిపారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని శివాలయంలో శనివారం నిర్వహించిన నేరేడుచర్ల వాసవీ, వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన మాట్లాడారు. వాసవీక్లబ్, వనితక్లబ్‌ల నూతన అధ్యక్షులుగా గెల్లి లక్ష్మీ నర్సింహారావు, గెల్లి లక్ష్మీ ప్రసన్న, ప్రధాన కార్యదర్శులుగా జూలూరి అశోక్, చెరుకు కవిత, కోశాధికారులుగా తాళ్లూరి శ్రీనివాస్, గరిణె జ్యోతితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఐఈసీ కీర్తన ఆధ్వర్యంలో డాన్‌టుడెస్క్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలకు రూ.80 వేల విలువైన వాటర్ ట్యాంకులు, వీధి వ్యాపారులకు గొడుగులు, నిరుపేద వృద్ధులకు చేతి కర్రలు, విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉత్తమ సేవలందించిన పలువురు కానిస్టేబుళ్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గెల్లా కృష్ణవేణి, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గరిణె అరుణ, డిస్ట్రిక్ట్ పీఆర్వో రాయపూడి భవాని, బిక్కుమల్ల కృష్ణ, వంగవీటి రమేష్, చిత్తనూరి సత్యనారాయణ, కొత్తా లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, వేణుమాధవ్, లక్ష్మయ్య, కందిబండ శ్రీను, మురారిశెట్టి రమేష్, నటరాజు, సైదయ్య, పరమేశం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో అపురూప జైన నిశిధి శిల్పం



జైన నిశిధి విగ్రహాన్ని పరిశీలిస్తున్న కుండె గణేష్

**ఆలేరు రూరల్, జూన్ 15:** యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో అపురూపమైన జైన నిశిధి (జైన మతస్థుల సమాధికి సబంధించిన శిల్పం) శిల్పాన్ని గుర్తించామని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కుండె గణేష్ శనివారం తెలిపారు. గ్రామంలోని పాటిగడ్డ మీద ఈ అపురూపమైన జైన నిశిధి బయటపడిందన్నారు. చతురస్రాకారంలో ఉన్న రాతి పలకల మీద రెండు పాదాలు చెక్కి ఉన్నాయని, ఇదివరకు ఎక్కడా లేని విధంగా ఆ పాదాల కింద రాతి పలక అంచులో ఎడమ చేతి మీద ఒరిగి పడుకొని ఉన్న కస్తూరి శిల్పం ఉందన్నారు. ఈ శిల్పం జైన మతంలో సల్లేఖనాన్ని సూచిస్తుందన్నారు. జైనధర్మ శిల్పాల్లో ఇటువంటి శిల్పం అపూర్వమన్నారు. ఈ శిల్పం లభించిన చోట దేవాలయ నిర్మాణ శిథిలాలు, ఒక చామరదారి, జైన యక్షుడి శిథిలశిల్పం కూడా లభించిందన్నారు. కొల్లూరులోనే గతంలో తమ చరిత్ర బృందం సభ్యుడు ఎస్.హరగోపాల్‌కు జైన మునిస్తంభం దొరికిందన్నారు.

## వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

**కోదాడ టౌన్, జూన్ 15 :** వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలని సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర నాయకులు ఆర్ సీతారామయ్య అన్నారు. శనివారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవం సందర్భంగా సమస్యలపై ఆర్డీవో సూర్యనారాయణకు వారి కార్యాలయంలో వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఇటీవల వృద్ధులపై వేధింపులు, దాడులు అధికం అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు, కోదాడ అధ్యక్షులు గడ్డం నర్సయ్య, కార్యదర్శి వెంకటేశ్వరరావు, రంగారావు, జాన్‌షరీఫ్, రుక్కుద్దీన్, జానకిరెడ్డి, హరిబాబు, శోభా, భ్రమరాంబ, మట్టపల్లిరావు, నరసయ్య, రంగారావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

# బావే సూత్రధారి

- కనగల్‌లో దొరికిన మృతదేహం మిస్టరీని ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసులు
- బావమరిది సొత్తు కాజేందుకు కుట్ర పన్నిన బావ
- ఏపీకి చెందిన ఆరుగురితో రెక్కీ హత్య
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి




నల్లగొండ జిల్లా కేంద్రంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారి సముద్రాల కృష్ణ హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

**నల్లగొండ క్రైం, జూన్ 15:** రైస్‌పుల్లింగ్ ఆశ చూపించి డబ్బు తీసుకున్న బావమరిది, ఆ సొత్తును ఇవ్వకపోవడంతో బావ హత్యకు కుట్రపన్నాడు. తనతో పాటు ఆరుగురిని పోగుచేసి బావమరిదిని నమ్మించి హత్య చేశాడు.ఈ కేసుకు సంబంధించిన మిస్టరీని నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ చందనాదీప్తి వెల్లడించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలకేంద్రంలోని బ్రిడ్జి కింద గత నెల 17వ తేదీన లభ్యమైన మృతదేహం కేసును ఛేదించి, నిందితులను అరెస్టు చేసినట్లు నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి తెలిపారు.ఆరుగురు నిందితులతో పాటు, గోల్డ్ రిసీవర్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.11,45,000 విలువైన ఏపీ39ఎంజే 3086 ఎర్టిగా కారు, టీఎస్30డీ 5355 బ్రీజా కారు, ఐదు సెల్‌ఫోన్లు, వెండి నడుము మొలదారం, కాళ్ల పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆమె వెల్లడించారు.

యాదగిరిగుట్టకు చెందిన సముద్రాల కృష్ణ(34) రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు రైస్ పుల్లింగ్ చేస్తూ కొంతకాలంగా ఆర్థికంగా మంచిగా స్థిరపడ్డాడు. ఆయనకు యాదగిరిగుట్టలో రెండు ఇళ్లు, భువనగిరిలో ఒక ఇల్లు, యాదగిరిగుట్టలో ప్లాట్లు ఉన్నాయి. అయితే కృష్ణకు తల్లిదండ్రులు లేకపోవడంతో పాటు వివాహం కాలేదు. రైస్‌పుల్లింగ్‌లో ఆరు నెలల్లోనే రూ.100 కోట్లు ఇప్పిస్తానని చెప్పి తన బావ అయిన హయత్‌నగర్‌కు చెందిన నాగబండి మధు వద్ద రూ.1.50 కోట్లు తీసుకున్నాడు. డబ్బు తీసుకుని ఆరు నెలలు గడిచినా రైస్‌పుల్లింగ్(పిడుగు పడినప్పుడు ఆ శక్తిని గ్రహించిన పాత్ర) ఇవ్వకపోవడంతో పాటు తీసుకున్న డబ్బు కూడా కృష్ణ ఇవ్వలేదు. దీంతో మధుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు వచ్చాయి. డబ్బు తిరిగి ఇవ్వాలని కృష్ణను నిలదీసినా, అతడు నిరాకరించడంతో మధు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. అయితే కృష్ణ వద్ద రూ.2కోట్ల నగదుతో పాటు కిలో బంగారం ఉంటుందని భావించి, అతడిని చంపి తన అవసరాలు తీర్చుకోవాలని కుట్రపన్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు పట్టణం భవానీపురం ప్రాంతానికి చెందిన ఎండీ.ఉస్మాన్‌కు వివరించాడు. అందుకోసం రూ.4వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. పథకాన్ని అమలు చేసేందుకు ఉస్మాన్ తన స్నేహితుడైన తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పట్టణం సత్యనగర్‌కు చెందిన రోజు కూలీ యల్లా కృష్ణచైతన్యతో ఫ్లిప్‌కార్ట్‌లో సైనెడ్, అదే పట్టణంలోని పల్లమరాజునగర్‌కు చెందిన ఐడీఎఫ్‌సీ రికవరీ ఏజెంట్ అడపా హరికిరణ్‌తో పెప్పర్ స్ప్రే తెప్పించాడు. అదేవిధంగా గుంటూరు జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కమ్మ శ్రీనివాసరావు సహాయాన్ని ఉస్మాన్ కోరాడు. కాకినాడలో గత నెల 9వ తేదీన మనోహర్ వద్ద ఎర్టిగా కారు అద్దె తీసుకుని అందుకు డ్రైవర్‌గా కాకినాడకు చెందిన కారు డ్రైవర్ సలాది మణికంఠతో కలిసి యాదగిరిగుట్టలో ఉంటున్న కృష్ణ ఇంటికి వెళ్లారు.

### పనిమనిషి ఉండటంతో..

యాదగిరిగుట్టలో నర్సరీ వ్యాపారం చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నాడంటూ కృష్ణకు రియల్‌ఎస్టేట్ వ్యాపారి కమ్మ శ్రీనివాసరావును నాగబండి మధు పరిచయం చేశాడు. అదేవిధంగా ప్లాట్ కొనుగోలు సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. అదే క్రమంలో మధు వెంట వచ్చిన వారిని నర్సరీలు పెంచేవారిగా పరిచయం చేశాడు. అయితే ఆ రోజు కృష్ణ ఇంట్లో పనిమనిషి ఉండడంతో అతడిని చంపేందుకు వీలుకాక ఆరుగురు తిరిగి వెళ్లిపోయారు.

### మరోసారి ప్రయత్నంలో

మొదటి ప్రయత్నం విఫలంకావడంతో గత నెల 16వ తేదీన మరోసారి కృష్ణను చంపేందుకు కాకినాడలో మనోహర్ వద్దే ఎర్టిగా కారును మధు, హరికిరణ్ అద్దెకు తీసుకున్నారు. కారు నెంబరు ఏపీ39 ఎంజే 3086ను తీసి వేసి ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టిన టీఎస్ 09ఎఫ్‌ఆర్ 0283 నంబరును కారుకు తగిలించి యాదగిరిగుట్టలోని కృష్ణ ఇంటికి చేరుకున్నారు. కృష్ణ ఆ సమయంలో ఒక్కడే ఉండడంతో నాగబండి మధు, అడపా హరికిరణ్ దాడి చేసి గొంతు నులిచి నోటిలో సైనెడ్ పోసి హత్య చేశారు. కృష్ణ మృతి చెందాడని నిర్ధారించుకున్నాక ఇంట్లో ఉన్న 7.4 తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి ఆభరణాలు, రూ.45వేల నగదు, కొన్నిపత్రాలు, మొబైల్ ఫోన్లను తీసుకుని, ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి సాక్ష్యాలను తారుమారు చేసేందుకు డీవీఆర్, మానిటర్‌ను తమ వెంట తీసుకెళ్లారు.

### సాక్ష్యాలు దొరకకుండా

కృష్ణ మృతదేహాన్ని ఆయన కారు బ్రీజా టీఎస్ 30డీ 5355లో మధు, హరికిరణ్, మిగతా వ్యక్తులు మనోహర్ వద్ద అద్దెకు తీసుకున్న ఎర్టిగా కారులో తీసుకొచ్చి నల్లగొండ జిల్లా కనగల్ వంతెనపై నుంచి కింద పడేసి దొంగిలించిన సొమ్ముతో పారిపోతూ డీవీఆర్, మానిటర్, సీసీ కెమెరాలు, కృష్ణ మొబైల్‌ఫోన్, ఖాళీ పెప్పర్ స్ప్రే బాటిల్, కేబుల్ వైర్, కట్టర్‌ను వాడపల్లి వద్ద కృష్ణానదిలో విసిరేశారు. ఆ తరువాత నిందితులు దొంగలించిన సొమ్మును సమానంగా పంచుకున్నారు. ఇదిలా ఉండగా కృష్ణను హత్య చేసేందుకు ఉస్మాన్, మధు పాతనేరస్థులైన ఏపీకి చెందిన శేఖర్, వెంకట్, టైసన్ సలహాలు తీసుకుని రెక్కీ నిర్వహించారు. కాగా, గత నెల 17వ తేదీన కనగల్ బ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులు శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ నుంచి ఎర్టిగా, బ్రీజా కారులో గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు చోరీచేసిన కారును విక్రయించేందుకు వెళ్తుండగా చండూరు సీఐ వెంకటయ్య, కనగల్ ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో అరెస్టు చేశారు. విచారణలో కృష్ణ వద్ద దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన గుంటూరుకు చెందిన షేక్‌బాబాను కూడా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, కనగల్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది రమేష్, ప్రభాకర్, స్వర్ణ నాయక్, సురేష్, బీ.సురేష్, సీహెచ్.రమేష్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

## స్టేషన్‌కు చేరిన చేనేత సంఘం పంచాయితీ




**చౌటుప్పల్ టౌన్, జూన్ 15 :** చౌటుప్పల్ పట్టణంలోని చేనేత సహకార సంఘంలో కొత్త వాటాదారు నమోదు వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఇరువర్గాల ఫిర్యాదుతో చిలికిచిలికి గాలివానగా మారుతోంది. అటు పర్సన్ ఇన్‌చార్జి, ఇటు చేనేత కార్మికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో సమస్య జఠిలంగా మారుతోంది. ఈ నెల 3వ తేదీన పర్సన్ ఇన్‌చార్జి కందకట్ల భిక్షపతి ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా కొందరిని వాటాదారులు(సభ్యులు)గా తీసుకోవాలని తీర్మానించారు. ప్రస్తుతం ఉన్న సభ్యులకే పనులను కల్పించలేని పాలకవర్గం కొత్తగా, ఏకపక్షంగా సభ్యత్వాన్ని కల్పించడంపై చేనేత కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వ్యవహారాన్ని చేనేత, జౌళీ శాఖ కమిషనర్, భువనగిరి ఏడీ విద్యాసాగర్ దృష్టికి చేనేత కార్మికులు తీసుకెళ్లారు. అయినా కొత్త సభ్యులకు వాటా ధనంగా రూ.1000 పాలకవర్గం ఆదేశాలతో సంఘం ఉద్యోగులు తీసుకొని రశీదు ఇస్తుండడంపై కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు సంఘం ఎదుట ఈ నెల 10వ తేదీన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతితో పాటు కొంతమంది డైరెక్టర్లకు, చేనేత కార్మికుల మధ్య తీవ్రఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో పాటు సంఘం ఆస్తులను విక్రయించేందుకు కుట్రచేస్తున్న పాలకవర్గాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 14న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆర్డీవో శేఖర్‌రెడ్డికి చేనేత కార్మికులు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాలను అందజేయడంతో సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్టు అయ్యింది. ఈ సంఘటనపై చేనేత, జౌళీ శాఖ అధికారులు విచారణ నిర్వహించి పాలకవర్గంపై చర్యలను తీసుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.


### 13 మంది కొత్త వాటాదారులను తొలగించాం

చౌటుప్పల్ చేనేత సహకార పర్సన్ ఇన్‌చార్జి కందకట్ల భిక్షపతి అధ్యక్షతన ఈ నెల 3వ తేదీన నిర్వహించిన పాలకవర్గం తీర్మానించిన 13 మంది కొత్త వాటాదారులను తొలగించాం. కొత్త వారిని వాటాదారులుగా తీసుకునే అధికారం పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీకి లేదు. చేనేత కార్మికులు(ప్రస్తుత వాటాదారులు) ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- విద్యాసాగర్, ఏడీ చేనేత, జౌళీ శాఖ, భువనగిరి

## నాన్నే నాకు స్ఫూర్తి

**నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి**



జానారెడ్డితో తనయులు రఘువీర్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి

మా నాన్న జానారెడ్డి మాకు స్ఫూర్తి. ప్రజల సమస్యలపై స్పందించే విధానమే మమ్మల్ని రాజకీయాల్లోకి వచ్చేలా ప్రేరణ కలిగించింది. ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్నా సామాన్యుల పట్ల నాన్న తీసుకునే శ్రద్ధ ఆశ్చర్యపర్చేది. ప్రజలకు సేవ చేయడమే రాజకీయాల ఏకైక లక్ష్యంగా ఉండాలని ఆయన చెప్పిన మాటలే ఎప్పుడూ మననం చేసుకుంటాం. చిన్నప్పటి నుంచి తమను ఎంతో గారాభంగా పెంచినా క్రమశిక్షణలోనూ అంతే గట్టిగా ఉండేవారు. క్రమశిక్షణ, నైతికవిలువల విషయంలో రాజీపడే వారు కాదు. కుమారులుగా తామే కాదు రాజకీయాల్లో ఎందరో నాన్నను అనుసరిస్తారు. నాన్న నిర్మించిన విలువల బాటలోనే జీవితాంతం ప్రజలకు సేవ చేసి ఆయన పేరును నిలబెడతాం..

**ఐ లవ్ యూ నాన్న అంటూ ఫాదర్ డే సందర్భంగా నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి స్పందించారు.**

- నల్లగొండ(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు





నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు స్వామివారి చిత్రపటం బహూకరణ

**భువనగిరి అర్బన్, జూన్ 15:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శనహోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకారమండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్రహవన పూజలు శైవాగమపద్ధతిలో కొనసాగాయి.కాగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.40,74,267 ఆదాయం సమకూరినట్టు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

### డిప్యూటీ సీఎంని కలిసిన ప్రభుత్వ విప్ అయిలయ్య

**భువనగిరి అర్బన్, జూన్ 15 :** డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గుట్ట ఆలయ ఈవో భాస్కర్‌రావుతో కలిసి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి చిత్రపటాన్ని బహూకరించి స్వామివారి లడ్డూప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈవో గట్టు శ్రావణ్‌కుమార్ వేర్వేరుగా పూజారులతో కలిసి డిప్యూటీ సీఎంను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి ఆలయ ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, వేద పండితుడు శ్రీనివాసశర్మలు సతీసమేతంగా చేరుకోగా భట్టివిక్రమార్క వస్త్రకానుకలు అందజేశారు. ఆలయ పూజారులు డిప్యూటీ సీఎంకి ఆశీర్వచనం అందజేశారు.

**కొండమల్లేపల్లి:** ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జన్మదినం సందర్భంగా శనివారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డిశ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, మంగ్యనాయక్ తదితరులున్నారు.

## గోవుల తరలింపును అడ్డుకోవడానికి చెక్‌పోస్టు

**కేతేపల్లి, జూన్ 15 :** బక్రీద్ పండగ నేపథ్యంలో నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు గోవులను తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టారు. ఈ మేరకు కొర్లపహాడ్ గ్రామశివారులోని టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలకు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద ఏపీ నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి పంపుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తనిఖీలను ముమ్మరం చేశారు. ఎనిమిది గంటలకు ఒక విడత చొప్పున మూడు విడతల్లో 24 గంటలూ తనిఖీలు చేసేందుకు చెక్‌పోస్టులో మొత్తం 8 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో కేతేపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన వారు ఐదుగురు, ముగ్గురు నల్లగొండ బెటాలియన్‌కు చెందిన వారు ఉన్నారు. సిబ్బంది పనితీరును ఎస్ఐ శివతేజ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి



లింగయ్య(ఫైల్)

**నూతనకల్, జూన్ 15:** చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాల గ్రామానికి చెందిన బింగి లింగయ్య(49) గత నెలలో తాటి చెట్టు ఎక్కుతూ కాలు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. లింగయ్యకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. లింగయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు మెంచు చక్రయ్య, అనంతుల శ్రీనివాస్, గునగంటి వెంకన్న, యామగాని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు.

## కుటుంబసమస్యలతో వ్యక్తి బలవన్మరణం

**మిర్యాలగూడ అర్బన్, జూన్ 15:** కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శనివారం జరిగింది. టూటౌన్ ఎస్ఐ రాంబాబు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన మారెండ్ల సైదులు(32) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సైదులు భార్య సుకన్య నెలరోజుల క్రితం చిన్నఆపరేషన్ చేయించుకొని పుట్టింటికి వెళ్లింది. భార్య తిరిగి వచ్చే క్రమంలో దంపతుల మధ్య వివాదం తలెత్తింది. దీంతో మనస్తాపం చెందిన సైదులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. సైదులుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### హైదరాబాద్‌లో...

**హయత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):** కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లోని శుభోదయకాలనీలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నల్లగొండ జిల్లా పెన్‌పహాడ్‌తండాకు చెందిన రూపావత్ పున్న, స్వప్న(20) దంపతులు శుభోదయకాలనీలో కొంతకాలంగా నివాసముంటున్నారు. పున్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో పనిచేస్తుండగా స్వప్న గృహిణిగా ఉంది. అయితే కొన్ని రోజులుగా భార్యాభర్తల నడుమ మనస్పర్థలు రావడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన స్వప్న శనివారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకున్నారు.

## దండుమల్కాపురంలో పట్టపగలు చోరీ

**చౌటుప్పల్ రూరల్, జూన్ 15 :** యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో శనివారం పట్టపగలు దొంగలు భారీ చోరీ జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం దండుమల్కాపురం ప్రాంతానికి చెందిన సిద్ధిపేట శేఖర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి భార్య కుమారుడితో కలిసి ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం విరగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం విరగొట్టి దుస్తులు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన 30 తులాల బంగారు ఆభరణాలు, లక్షన్నర నగదు కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు కుప్పకూలిపోయారు. ఘటన గురించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు

### ఆలేరులో మూడు ఇళ్లలో...

**ఆలేరు రూరల్ :** యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో శుక్రవారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో చోరీ చేశారు. ఎస్ఐ వెంకటశ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాంశివాజీనగర్, శాంతినగర్ కాలనీల్లోని మూడు ఇళ్లలో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. కౌర చంద్రయ్య ఇంట్లో కిలోన్నర బంగారం, 10 తులాల వెండి, అబ్బాస్ అలి ఇంట్లో సుమారు రూ.లక్ష నగదు, సంతోష్ ఇంట్లో రూ.35వేల నగదు దొంగిలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రను సేకరించారు. వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## కారు బోల్తా, ఇరువురికి గాయాలు

**నాగార్జునసాగర్, జూన్ 15 :** కారు బోల్తా పడిన ఇరువురికి గాయాలయ్యాయి. శనివారం ఉదయం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం కనిగిరికి చెందిన అశోక్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి కనిగిరికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హిల్‌కాలనీ సమీపంలోకి రాగానే ఎదురుగా పంది అడ్డు రావడంతో దానిని తప్పించబోగా కారు అదుపు తప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న అశోక్‌కుమార్, ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కారు ఢీకొని ముగ్గురికి..

**మద్దిరాల, జూన్ 15 :** ట్రాక్టర్, బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.ఈసంఘటన శనివారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామస్టేజీ వద్ద జరిగింది. పోలుమళ్ల గ్రామానికి చెందిన బెజ్జంకి రాజు కుమారులు సాయితేజ, శివతేజ బైక్‌పై గ్రామం నుంచి స్టేజీ వద్దకు వస్తుండగా అదే గ్రామానికి చెందిన కొంసాని శ్రీనివాస్‌రెడ్డి ట్రాక్టర్‌తో గ్రామంలోకి వెళ్లే క్రమంలో మూలమలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైద్రాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

**వలిగొండ, జూన్ 15:** మండలంలోని వెంకటపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. జూన్ 20 నుంచి 24 వరకు అంగరంగా వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏవో మోహన్‌బాబు, గ్రామపెద్దలు నరేష్‌రెడ్డి, వెంకటేశం, రోశయ్య పాల్గొన్నారు.

## ప్రతీ రైలులో సాధారణ బోగీలు పెంచాలి



ప్రధానికి రాసిన ఉత్తరాలను ప్రదర్శిస్తున్న రైల్వే ప్రయాణికులు

**భువనగిరి టౌన్, జూన్ 15:** రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్య పెంచాలని బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పిరికి పండ్ల అశోక్ అన్నారు. ఈ మేరకు చేపట్టిన ఉత్తరాల ఉద్యమాన్ని శనివారం భువనగిరిలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పరిమిత బోగీలతో ప్రయాణికులు గమ్య స్థానాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. దీంతో సమస్య పరిష్కారానికి భారత ప్రధానికి దేశవ్యాప్తంగా రైల్వే ప్రయాణికులు కోటి ఉత్తరాలు రాస్తున్నట్టు తెలిపారు. ఉత్తరాల ఉద్యమంలో రైల్వే ప్రయాణికులందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ మేరకు రాసిన ఉత్తరాలను పోస్ట్ చేశారు. రైల్వే ప్రయాణికులు శ్రీధర్, చంద్రశేఖర్, రవి, యాకయ్య, వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

## మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్‌కు కొర్రీలు




విలేకరులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శాంతికుమార్

**మోత్కూరు, జూన్ 15:** ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులకు మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్‌కు డీఈవో కార్యాలయంలో కొర్రీలు పెడుతున్నారని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు వనం శాంతికుమార్ అన్నారు. శనివారం యూటీఎఫ్ మోత్కూరు ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 26 మంది ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు పెండింగ్‌లో పెట్టారన్నారు. ఏ జిల్లాలో లేని నిబంధనలు ఇక్కడ పెట్టారని ఆయన విమర్శించారు. ఈ విషయమై ఈ నెల 12వ తేదీన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి వినతి పత్రం అందజేశానన్నారు. ఇప్పటికైనా డీఈవో స్పందించి పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎ.వెంకటాచారి, నాయకులు సుబ్రమణ్యశర్మ, ఎ.వల్లభాయ్ ఆయన వెంట ఉన్నారు.


## ఈద్గాలో బక్రీద్ ఏర్పాట్లు

**భువనగిరి టౌన్, జూన్ 15:** జిల్లా కేంద్రం భువనగిరిలోని ఈద్గాలలో బక్రీద్ ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. సోమవారం జరుపుకోనున్న బక్రీద్ పర్వదినంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించేందుకు అనువుగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను శనివారం మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పరిశీలించారు. త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. మునిసిపల్ ఏఈ కొండల్‌రావు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ఎంపీపీ

**భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 :** ఎన్నికల కోడ్ ముగిసినందున అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రగతి నివేదికపై చర్చించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాపర్తి భాస్కర్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశంయాదవ్, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేష్, వ్యవసాయాధికారి ఎజాజ్ అలీఖాన్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, మండల పరిషత్ సూపరిండెంట్ ఎం అపర్ణ, ట్రాన్స్‌కో ఏఈ క్రాంతి, ఎంపీటీసీలు బందారపు సుమలత లక్ష్మణ్‌గౌడ్, జంగయ్యయాదవ్, రావుల శ్రీదేవి శేఖర్‌రెడ్డి, బొక్క అమృత పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి రూ.2లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

**బీబీనగర్, జూన్ 15:** బీబీనగర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న వయోవృద్ధుల సంక్షేమ ఆశ్రమ భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శనివారం రూ.2లక్షలను విరాళంగా అందజేశారు. సంఘం అధ్యక్షుడు కాసుల సత్యనారాయణ గౌడ్, ఎర్ర మనోహర్‌లకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లింగారెడ్డి, పెద్ద రామాంజనేయులుగౌడ్, నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, ధర్మయ్య పాల్గొన్నారు.

## స్కూల్ తరలింపుపై రాజకీయాలు మానుకోవాలి: ఎన్‌ఎస్‌యూఐ

**భువనగిరి టౌన్, జూన్ 15:** భువనగిరిలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తరలింపు అంశంపై బీజేపీ చేస్తున్న అనవసర రాజకీయాలు మానుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ అన్నారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల తరలింపుపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, నెలరోజుల క్రితమే ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కలెక్టర్, డీఈవోతో మాట్లాడారని సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురిపంగ చందు, నాయకులు బొల్లేపల్లి వినయ్, ఉపేందర్‌గౌడ్, ఎండి.షరీఫ్, ఎండి.మసూద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



# అరకొర సిబ్బందితో పశువైద్యం

- శిథిలావస్థలో పశువుల ఆసుపత్రి భవనాలు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు








మునిపంపులలోని గ్రామీణ పశువైద్యశాల, నెర్రెలువారిన గోడలు

**రామన్నపేట, జూన్ 15:** రామన్నపేట పశు వైద్య శాఖ ఏరియా ఆసుపత్రి పరిధిలోని తుమ్మలగూడెం, కక్కిరేణి వెల్లంకి, మునిపంపుల గ్రామాల పశువైద్య ఉపకేంద్రాలలో ఏళ్ల తరబడి డాక్టర్లు, సరిపోను సిబ్బంది లేక రైతులు పశువులు, గొర్రెలు, మేకల చికిత్స కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు గ్రామాల్లోని ఉప కేంద్రాలకు ఒకే ఒక డాక్టర్ ఉండడంతో రెండు రోజులకోసారి ఒక ఉప కేంద్రానికి వస్తుంటారు. ఏదైనా గ్రామాల్లో తీవ్రమైన జబ్బుతో రోగాల బారిన పశువులను రామన్నపేట ఏరియా ఆసుపత్రితో పాటు ఉప కేంద్రాల్లో అవసర చికిత్సకు అవసరమయ్యే మందులు అందుబాటులో లేకపోవడం, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు అవసరమయ్యే మందులను ప్రైవేట్ మెడికల్ షాపులనుంచి రైతులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మండలంలోని పలు ఆసుపత్రుల్లో అటెండర్ తదితర సిబ్బంది లేకపోవడంతో డాక్టరే అన్ని పనులనూ చూసుకోవాల్సి వస్తుంది. సిబ్బంది కొరత కారణంగా అందుబాటులో ఉన్న సిబ్బందే గ్రామాల్లోని పశువులు, మేకలు, గొర్రెలకు వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై పలు మార్లు ప్రజా ప్రతినిధులకు తెలిపినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. గేదెలకు కృత్రిమ గర్భధారణ చేసినా చూడి నిలవడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. దాణా, గడ్డి ధరలు విపరీతంగా ఉండడం, పశు పోషణ కష్టతరంగా ఉన్న సమయంలో గేదెలు సరైన సమయంలో ఎదకు రావడం, కృత్రిమ గర్భధారణతో చూడి కట్టించడమనేది ముఖ్యమైన ప్రక్రియ. గేదెలు చూడి నిలవకపోతే గేదె ఈనదు. పాలు ఇవ్వదు. కాబట్టి రైతుకు నష్టం కలుగుతుంది.

### శిథిలావస్థలో మునిపంపుల పశువైద్యశాల

మునిపంపుల గ్రామ పశు వైద్య శాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భారీ వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి మరమ్మతు పనులు చేపట్టాలని ఉన్నత అధికారులకు తెలిపినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామాల్లో సీజనల్ జబ్బులు, తదితర రోగాల నివారణకు వైద్య శిబిరాలను నిర్వహిస్తుంటారు. రామన్నపేట పశువైద్య ఏరియా ఆసుపత్రిలో ఒక డాక్టర్, ఏడీఏ, కాంపౌండర్, అటెండర్ ఉన్నారు. వీరిలో విధులకు వంతుల వారీగా ఒకరిద్దరు మాత్రమే హాజరవుతున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

### గేదెలకు చూడి నిలవడంలేదు



ఎద లక్షణాలు కనిపించగానే పశువులను పశు వైద్య శాలలో కృత్రిమ గర్భధారణ చేయించాను. పలుమార్లు కృత్రిమ గర్భధారణ చేయించినా ఎద నిల్వడం లేదు. దీంతో సంవత్సరాలు తరబడి పాడి సంపద లేక నష్టపోతున్నాం. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనానికి మరమ్మతులు చేయించాలి. లేదా నూతన భవనం నిర్మించాలి. ఆసుపత్రికి ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం లేదు. వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి.

-మహ్మద్ ఖాజామొయినొద్దీన్, పాడిరైతు, మునిపంపుల

### మందులు అందుబాటులో ఉంచాలి



ప్రభుత్వ పశువైద్యశాలలో మందులను అందుబాటులో ఉంచాలి. మునిపంపుల పశువుల ఆసుపత్రికి గతంలో మాదిరిగా డాక్టర్ పోస్టును మంజూరు చేయాలి. పశువుల వీర్య నిల్వలను ఎప్పటికప్పుడు మార్చాలి. చాలా రోజుల నిల్వలను వినియోగించడం వల్ల గేదెల్లో చూడి నిలవడం లేదు. దీర్ఘకాలిక జబ్బులకు సంబంధించిన మందులను ఉప కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి. అవసరమైనప్పుడు కొనుగోలు చేయడం అదనపు భారంగా మారింది.

-తొలుపునూరి మల్లేశం, పాడి రైతు, మునిపంపుల

### పోషక లోపం ఉంటే గర్భం నిల్వదు



ఎద లక్షణాలు కనిపించగానే గేదెను వేరు చేసి ఉంచాలి. కృత్రిమ గర్భధారణ చేయించిన గేదెలు, పశువులను ఏకాంతంగా చల్లని ప్రదేశంలో ఉంచడం మంచిది. ఉదయం, సాయంత్రం పశువును కడగాలి, పోషకలోపం ఉండటంతో ఎదకు రాదు. ఒక వేళ వచ్చినా ఎద నిల్వదు. శిథిలావస్థకు చేరిన మునిపంపుల పశువైద్యశాల భవనం మరమ్మతుకోసం నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశాం.

-శ్రీధర్‌రెడ్డి పశువైద్యాధికారి, రామన్నపేట

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సిరిపురం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

**రామన్నపేట, జూన్ 15:** మండలంలోని సిరిపురం గ్రామంలో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రి సహకారంతో శనివారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 48 మంది రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైన్స్‌క్లబ్ అధ్యక్షులు ఎస్ సంజీవరెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణదాత కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి మేనేజర్ ఏ వాసుకిరణ్ రెడ్డి, క్యాంపు కోఆర్డినేటర్ శ్రీధర్, డాక్టర్ జయసాయి, ప్రతిభ, సంతోష్, సమీర్, నితిన్ చంద్ర, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఎస్వీ రాములు, నిర్మల్, అనిత, సైదులు, శ్రీను, లయన్స్ క్లబ్ సభ్యులు, శంకరయ్య, భాస్కరాచారి, వెంకటేష్, గోవర్ధనాచారి, అనంతరెడ్డి, సూర్యనారాయణ, విజయానందం, అయిలయ్య, నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పున్న జగన్‌మోహన్, రాపోలు నర్సింహ, గుత్త నర్సిరెడ్డి, జినుకల ప్రభాకర్, బాబురావు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న సంఘం మండల అధ్యక్షుడు వెంకన్న

**గుండాల, జూన్ 15:** గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలని గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పొడిశెట్టి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల గ్రామీణ వైద్యుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40సంవత్సరాల నుంచి గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని కొంత మంది అధికారులు కావాలనే గ్రామీణ వైద్యులపై దాడులకు పాల్పడుతున్నారని వెంటనే దాడులను ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. వివిధ గ్రామాల్లో ఇటీవల గ్రామీణ వైద్యులపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు దాడులు నిర్వహించడం సరైంది కాదని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారని ఇదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు నిర్వహించి, శిక్షణ ప్రతీ ఒక్కరికి సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎం.సోమలింగచారి, జిల్లా ఈసీ మెంబర్ యాదగిరి, సైదులు, రమేశ్, కొండల్‌రావు, మధు, ధన్‌రాజ్, ఆనంద్, నర్సింగరావు, శ్యాం, కృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మోత్కూరు, జూన్ 15:** మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్థంబాలు పక్కకు జరిపేందుకు (విద్యుత్ లైన్ షిఫ్టింగ్‌కు) ఈ నెల 16న కొత్త బస్టాండు ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఏఈ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బస్టాండ్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### బాలుర వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**మోత్కూరు, జూన్ 15:** మోత్కూరు బాలుర వసతి గృహంలో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి ఎం.రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరానికి వసతి గృహంలో ప్రవేశంకోసం ఈ నెల 12వ తేదీనుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు ఫోటోలు తీసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 99596 46811 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

### పథకాల దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం

**మోత్కూరు, జూన్ 15:** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఆ దరఖాస్తుల్లో ఏవైనా తప్పులు ఉన్నట్టయితే సవరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన దరఖాస్తుదారులు మునిసిపల్ కార్యాలయానికి వచ్చి తమ దరఖాస్తుల్లోని తప్పులను సవరించుకోవాలని కోరారు.

### ఎస్సీ న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**భువనగిరి అర్బన్, జూన్ 15:** ఎస్సీ కులాల న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాద వృత్తిలో మూడేళ్ల పాటు శిక్షణ కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవచ్చని, న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉత్తీర్ణులై తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలు మించని అభ్యర్థులు అర్హులని, శిక్షణ కాలంలో ఉపకార వేతనం, పుస్తకాలు, కంప్యూటర్, ఫర్నీచర్, లాయర్ దుస్తులు కొనుగోలుకు రూ. 50వేలు అందజేయనున్నట్లు, 2024 జూలై 6వరకు దరఖాస్తులకు చివరి తేదీ ఉండగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మోత్కూరులో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి



గుండాల: పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**మోత్కూరు, జూన్ 15:** ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిఫైడ్ టీచర్లు ఉంటారని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మోత్కూరు ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా, ఉచితంగా విద్యనందించడంతో పాటు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఆర్.రవీందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఎండి.జమీలా, ఉపాధ్యాయులు కె.అరుణ, బి.లలిత, కె.సౌజన్య, అంగన్‌వాడి టీచర్ శోభ పాల్గొన్నారు.

**వలిగొండ:** పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు హనీఫ్‌అహ్మద్ కోరారు. శనివారం మండలంలోని వర్కట్‌పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంధ్య, నిర్మల, పాల్గొన్నారు.

**గుండాల:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీహెచ్ఎస్ గుండాల జీహెచ్ఎం చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ దేవరబోయిన లింగయ్య, ఉపాధ్యాయులు మెర్సిగ్రేసి, హరిత, జగన్, స్వప్న, రవి, భాగ్యలక్ష్మీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వర్కట్‌పల్లి బడిబాటలో పాల్గొన్న మహిళలు

## నిబద్ధతతో విధులు నిర్వహించాలి



డీపీవో ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్ తదితరులు

**భువనగిరి రూరల్, జూన్ 15:** నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భువనగిరి ఆర్డీవో పరాంకుశం అమరేందర్ అన్నారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ ఆర్డీవో కార్యాలయ డీఏఓ మందడి ఉపేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని టీజీవో, టీఎన్జీవో సంఘాల ఆధ్వర్యంలో శనివారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భువనగిరి తహసీల్దార్ అంజిరెడ్డి, సూపరిండెంట్ రామారావు, టీఎన్జీవో ప్రతినిధులు ఖదీర్, ఇమాన్యూయల్, శ్రీకాంత్, టి సంజీవరెడ్డి, వంశీ, పృధ్వి, జాఫర్, సజ్జత్, కృష్ణ ఉన్నారు.

## 18 నుంచి 20 వరకు జడ్పీస్థాయి సంఘం సమావేశాలు

**భువనగిరి రూరల్, జూన్ 15:** జడ్పీ స్థాయి సంఘం సమావేశాలు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఏర్పాటు చేసినట్టు సీఈవో ఎం.శోభారాణి తెలిపారు. 18న తేదీన 1వ (ఆర్థిక, ప్రణాళిక సంఘం), 2వ (గ్రామీణాభివృద్ధి), 4వ (విద్యా, వైద్య) స్థాయి సంఘం, 19వ తేదీన 5వ (మహిళా, శిశు సంక్షేమం), 3వ (వ్యవసాయం) స్థాయి సంఘం, 20వ తేదీన 6వ (సాంఘీక సంక్షేమం) స్థాయి సంఘం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

## నిబంధనలు పాటించని రెండు బస్సులపై కేసు

**చౌటుప్పల్, జూన్ 15:** నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు బస్సులపై కేసుల నమోదు చేశారు. చౌటుప్పల్ మండలంలో శనివారం రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీటీవో సాయికృష్ణ ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎంవిఐలు ఆనంద శ్యాంప్రసాద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**మోత్కూరు :** నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధించిన తీన్మార్ మల్లన్నను శనివారం కాంగ్రెస్ మోత్కూరు నాయకులు కలిసి శాలువాలతో సన్మానించి, అభినందించారు. ఆయన్ను కలిసిన వారిలో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి రవి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ యాదగిరిరెడ్డి ఉన్నారు.

**మోత్కూరు :** చిన్నారిపై అత్యాచారం జరిపి, హత్యచేసిన దుండగున్ని పట్టుకుని వెంటనే ఉరితీయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దుండగున్ని పట్టుకుని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

**ఆలేరు రూరల్:** చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఆర్ సీత శనివారం ఆలేరులో ఒక ప్రకటనలో కోరారు. డ్రగ్స్‌ను నివారించడంతో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

**మోత్కూరు :** మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి హైదరాబాదులో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య ఆయన్ను సన్మానించి అభినందించారు. పైళ్ల సోమిరెడ్డి, పేలపూడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు నిమ్మనగోటి జోజి, పేలపూడి మధు పాల్గొన్నారు.

**మోత్కూరు :** కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంటనే పింఛన్లు పెంచడంతోపాటు ఇతర హామీలు కూడా అమలు చేయాలన్నారు.

**అడ్డగూడూరు:** రాష్ట్ర సమితి ఏఐఎస్ఎఫ్ పిలుపులో భాగంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ విద్య సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని అడ్డగూడూరు మండల కేంద్రంలోని విద్య వనరుల కేంద్రంలో లోయర్ డెవలప్మెంట్ అసిస్టెంట్ క్రాంతి కూమార్‌కి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కూమార్ నాయకులు తలాల సాయి, చిప్పలపల్లి బన్ని ఉన్నారు.

**భువనగిరి అర్బన్ :** బెస్ట్ అవైలబుల్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న నిధులకు విడుదల చేయాలని పీపుల్స్ మానిటరింగ్ రాష్ట్ర కన్వీనర్ సుర్వంగ శివలింగం కోరారు. ఎస్సీ కులాల అభివృద్ధి డైరెక్టర్ ఉమాదేవికి వినతి పత్రం అందజేశారు.

**భువనగిరి అర్బన్ :** ఎస్సీ కులాల న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాద వృత్తిలో మూడేళ్ల పాటు శిక్షణ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

**మోటకొండూర్ :** భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయలకు పదోన్నతులు కల్పించడంతో మూడు దశబ్దాల కల నేరవేరిందరి పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు గందమల్ల విశ్వరూపం, వ్యాయామ ఉపాధ్యాయుడు కొరటికంటి వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

**వలిగొండ:** హైదరాబాద్‌లో ఇందిరాపార్కులో జరిగే బీసీ జనసభకు మండలంలోని పలు గ్రామాల నుంచి బీసీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదు అని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాండు, నర్సింహ పాల్గొన్నారు.

**సంస్థాన్ నారాయణపురం:** మండలంలోని కంకణాలగూడెం పరిధిలోని దేశ్యతండా, శేరిగూడెం గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కరెంటోతు ప్రజ్ఞా నాయక్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. లోవోల్టేజీ కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

**భువనగిరి టౌన్ :** భువనగిరిలోని పాత భారత్ థియేటర్ వద్ద ఉప్పలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ రెండో రోజు ఆందోళనలు కొనసాగాయి. శనివారం ఆలయంలో బీజేపీ, వీహెచ్‌పీ హిందూ వాహిని కార్యకర్తలతో పాటు భక్తులు పూజలు చేసి దోషులను గుర్తించి శిక్షించాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రత్నపురం బలరాం, శ్రీశైలం, పోల శ్రీనివాస్ గుప్తా, సుర్వి శ్రీనివాస్ గౌడ్, దేవరకొండ నర్సింహచారి, పూస శ్రీనివాస్ పాల్గొన్నారు.